సాక్షి చిత్తూరు

బుధవారం ı 24 ı జులై ı 2024



యాజమాన్య పద్ధతులతో దిగుబడి

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యాన శాఖాధికారి అన్నారు. - IIలో



టీచర్ల సంతకాల సేకరణ

జీఓ 77 రద్దు చేయాలని కోరుతూ టీచర్ల సంతకాల సేకరణకు పూనుకున్నారు. సమస్యల్ని పరిష్కరించాలని కోరారు - IIలో



ఆశలు...ఆకాంక్షలు

ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లోని సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి, అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. - IIలో

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలు ముఖ్యం

–జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీలో కలెక్టర్



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కలెక్టర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. డయాలసిస్, ఎక్స్‌రే, క్యాజువాలిటీ, ఓపీ వార్డు, పీడియాట్రిక్, గైనిక్, లేబర్ వార్డులను, ఆసుపత్రిలో నూతన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎంసీహెచ్, రేడియాలజీ విభాగాల్లో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, అలాగే డయాలసిస్ రోగులకు అందిస్తున్న సేవలను చూశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, అపోలో సిబ్బంది ద్వారా మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు, భోజన వసతి, పారిశుద్ధ్యం, ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం..ఇత్యాది అంశాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్, అపోలో సిబ్బందితో సమీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో సీసీఓ నరేష్ కుమార్ రెడ్డి, అపోలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్, ఆర్ఎంఓ సంధ్య, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

పేదోళ్లను పట్టించుకోండి సామీ!

పరిశీలన అనంతరం బయటకు వచ్చిన కలెక్టర్‌ను చూసి ఓ రోగి.. సామీ..పేదోళ్లను పట్టించుకోండి..పంచ కట్టుకునివస్తే..తరిమేస్తున్నారు.. వస్తున్నారు.. పోతున్నారు.. మంచిగా వైద్యం చేయించండి.. అంటూ తన గోడు నివేదించాడు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్, రూరల్ ఈఈలు మునిచంద్ర, హరి తెలిపారు. చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల, ఆవులకొండ, పెనుమూరు, జీడీనెల్లూరు, పాలసముద్రం, ఎస్ఆర్‌పురం, కొత్తపల్లె, పూతలపట్టు, ప్రాంతాల వినియోగదారులు చిత్తూరు గాంధీరోడ్డులోని విద్యుత్ కార్యాలయంలో, ఐరాల, బంగారుపాళ్యం, అరగొండ, తవణంపల్లె, పైపల్లె, కేజీసత్రం ప్రాంతాల వారు గిరింపేటలోని ఈఈ కార్యాలయంలో సమస్యలను తెలియజేయాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు తీసుకుంటారని తెలియజేశారు.

సీత కన్ను



- వేతన జీవులకు మేలు శూన్యం
- ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒరిగిందేమీ లేదు
- నిరాశాజనకంగా ఉందని పెదవి విరుపు
- పన్నుల భారం, ధరల మోతపై ప్రస్తావనేదీ?

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. ఎన్డీయేలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉండటం, చంద్రబాబుకు ఉన్న పరిచయాల దృష్ట్యా రాష్ట్రానికి మేలు కలుగుతుందని ఆశించిన ప్రజానీకానికి నిరాశే ఎదురైంది. వెనుకబడిన రాయలసీమకుగానీ, ఉమ్మడి జిల్లాకు ఒరిగిందేమీ లేదని బడ్జెట్ తేటతెల్లం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రైవేటీకరణ జపం జపిస్తోన్న కేంద్రం విభజన హామీలకు కేటాయింపులూ చేయలేదని మండిపడుతున్నారు. ఇది ఉద్యోగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని వామపక్షాలు నిరసించాయి.

పలమనేరు: కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒరిగిందేమీ లేదని, ప్రధానంగా వేతన జీవులకు ఈ బడ్జెట్ ఎంతో నిరాశను కలిగించిందని జిల్లా ప్రజలు పెదవి విరిచారు.. 'ముద్ర' రుణాల పరిమితిని పెంచడం, విద్యుత్ ఆదా కోసం సౌర ఫలకాల ఏర్పాటు, బంగారం ధరలు తగ్గుముఖం పట్టేలా చర్యలు, రక్షణ రంగానికి పెద్దపీట వేయడం మినహా స్థానికంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బడ్జెట్‌తో చేకూరే మేలు లేదనే మాట వినిపిస్తోంది. ముఖ్యంగా ఆకాశానంటుతున్న నిత్యావసర ధరలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం, పన్నుల భారం తగ్గించడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం లాంటి అంశాలు లేవని విమర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ఒరిగిందేమీ లేదు

దక్షిణ భారతదేశంలో రెండు పారిశ్రామిక కారిడార్లను ఇచ్చారుగానీ రాయలసీమలో వెనుకబడిన ఉమ్మడి జిల్లాకు ఈ బడ్జెట్‌లో మేలు లేకుండా పోయింది. ముఖ్యంగా చిత్తూరు జిల్లాకు పారిశ్రామిక హబ్ వస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఆ ఊసే లేకుండా పోయింది. ఇప్పటి కొత్త జిల్లాలో సెజ్‌లుకూడా అంతంత మాత్రమే. ఎస్ఎంఎస్ఈలకు కాస్త మేలు చేస్తామని మాత్రమే చెప్పడం కాస్త ఊరట. ఇక కొత్త రైల్వే ప్రాజెక్టులు సైతం జిల్లాకు లేకుండా పోయాయి. దేశంలో లక్ష పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారేగానీ చిత్తూరు జిల్లాకు మాత్రం ఇవి వస్తాయా, రావా? అనే స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలోని టూరిజం అభివృద్ధికి సైతం ఊసే లేకుండా పోయింది. కనీసం ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయలేదు.

కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉంది. ఇది కార్పొరేట్ సంస్థలకు అనుకూల బడ్జెట్. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించకపోవడం దుర్మార్గం. పోలవరం, రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించక నామమాత్రపు నిధులతో గొప్పగా డప్పు కొట్టుకుంది. తిరుపతిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా నిధులు కేటాయించలేదు. ఇప్పుడు హడావుడిగా కండలేరు డ్యామ్ కట్టను తెగ్గొట్టి నీటిని మళ్లించడంతో రానున్న రోజుల్లో తీరని నష్టం జరిగే ప్రమాదం ఉంది. రాయలసీమ పడమటి ప్రాంతాలలో సాగు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం బాధాకరం. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేయించాలి.

– పీ.హరినాథ్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నేత

వేతన జీవులకు నిరాశ



కేంద్ర ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు నిరాశను మిగిల్చింది. ప్రామాణిక తగ్గింపు వేతనాన్ని రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం తప్పితే ఇతరత్రా ఎలాంటి మేలు లేదు. పెరిగిన జీవన ప్రమాణాల ఆధారంగా ఆదాయపు పన్ను పరిమితిని రూ.5లక్షలకు పెంచాల్సింది. బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ ఊసే లేకుండా పోయింది.

– సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షులు

పాత పెన్షన్ ఊసే లేదు



బడ్జెట్‌లో కోట్లాదిమంది ఉద్యోగులకు మేలు కలిగే పాత పెన్షన్ విధానంపై ఏమాత్రం ఊసే లేదు. అధికశాతం మంది ఆదాయపు పన్ను కట్టే విధానంలో ఎలాంటి సవరణలు చేయకుండా తక్కువ శాతం మంది పన్నులు కట్టే వారికి మేలు చేసింది. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న ఏపీకి విభజన హామీల మాటే లేకుండా పోయింది.

–ఆనంద్‌బాబు, ఏపీ ఎన్జీవో అధ్యక్షులు, పలమనేరు

రూ.15వేల కోట్లు ఉచితమా, అప్పా?



అమరావతి రాజధాని కోసం కేంద్రం 15వేల కోట్లను ఇవ్వడం ఉచితమా లేక అప్పా? అనే క్లారిటీ లేదు. కానీ కేంద్ర బడ్జెట్‌తో మన జిల్లాకు జరిగిన మేలు ఏమీలేదని అర్థమైంది. అందరికీ వర్తించే సౌర ఫలకాలు, పారిశ్రామికీకరణ అభివృద్ధికి ఎస్ఎంఎస్ఈల బలోపేతం మినహా మనకంటూ ప్రత్యేకంగా జరిగిన మేలు బడ్జెట్‌లో ఏమీ కనిపించలేదు.

–మొహిదీన్, న్యాయవాది, పలమనేరు

ప్రజాప్రతినిధులు బడ్జెట్‌పై నిలదీయాలి



కేంద్ర మంత్రి ప్రకటించిన బడ్జెట్ పూర్తిగా సత్యదూరం. ఆంధ్రప్రజలను మభ్యపెట్టినట్లు కనబడుతోంది. కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీలు ఈ బడ్జెట్‌పై స్పందించాలి. స్పెషల్ స్టేటస్ లేదు, ప్యాకేజీ మాటలే అధికంగా వినిపించాయి. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తారని నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. కానీ నిరుద్యోగులను పట్టించుకున్న పాపానపోలేదు. కేంద్ర విద్యాసంస్థల అభివృద్ధిని సైతం పట్టించుకోలేదు.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

స్వల్ప ఊరట



కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు స్వల్ప ఊరటే లభించింది. ఆదాయ పన్ను స్లాబ్ రేట్లను కొత్త విధానంలో సవరించడం, స్టాండర్డ్ డైరెక్షన్ 50 వేల నుంచి 75 వేలకు పెంచడం ద్వారా ఉద్యోగులకు స్వల్ప ఊరటనిచ్చినట్టయ్యింది. ఇంకా ఉదారంగా ఆలోచించి ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా పాత విధానంలోనూ మార్పులు చేసి ఉండాల్సింది.

– ఎస్.బాలాజీ,రాష్ట్ర అధ్యక్షులు, ఆపస్

కేంద్రంలో టీడీపీ కీలకంగా ఉన్నా..



కేంద్రంలో తెలుగు దేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉంది. కూటమి ప్రభుత్వం ఇక్కడ అధికారంలో ఉన్నప్పటికీ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు బడ్జెట్‌లో ఒరిగిన మేలంటూ ఏమీలేదు. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. కనీసం రాష్ట్రంలో వెనుకబడిన మన జిల్లాకు ఓ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రకటించి ఉంటే బాగుండేది.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

ఉద్యోగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్



నిర్మలా సీతారామన్ బడ్జెట్ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను నిరాశపరిచింది. ఎప్పటిలాగే జిల్లా ప్రజలు మరోసారి మోసపోయారు. వికసిత్ భారత్ అంటూ మీడియాలో ప్రగల్భాలు పలుకుతూ ప్రచారం చేశారు. బడ్జెట్‌లో ఆ దిశగా నిధులు కేటాయింపులు చేయలేదు. ప్రతి ఏడాదీ కోటి మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి మరో ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగం కల్పించే యజమానికి లాభం చేకూర్చే విధంగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈపీఎఫ్ పెన్షనర్లు తమ కనీస పెన్షన్‌ను పెంచమని కొంతకాలంగా విన్నవించినా బడ్జెట్‌లో ఆ ప్రస్తావనేలేదు.

–కందారపు మురళి, సీఐటీయూ, ప్రధాన కార్యదర్శి, తిరుపతి

కూటమి నేతలు స్పందించాలి



బడ్జెట్‌లో జిల్లా ప్రస్తావన లేకపోవడం శోచనీయం. దేశంలో తిరుపతికి ప్రత్యేక స్థానం ఉంది. అటువంటిది కేంద్ర బడ్జెట్ పూర్తి పాఠం వింటే ఆశ్చర్యమేసింది. రైల్వే, బస్టాండ్, జాతీయ రహదారులు, కోస్టల్ తీరంపై ఈ బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తారని ఆశించాం. కనీస ప్రస్తావన లేకుండా, అమరావతి ఇచ్చే నిధులపై పూర్తి స్పష్టత లేదు. గతంలో ఎన్నో బడ్జెట్లు చూశాం. విశ్లేషించాం. కానీ ఇంతదారుణంగా బడ్జెట్ ఉంటుందని ఆలోచించలేదు. ఎంపీ గురుమూర్తి పలు మార్లు జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపించారు. అదేవిధంగా స్వయంగా కేంద్ర మంత్రులను కలసి జిల్లా సమస్యలపై విన్నవించారు. జిల్లాకు బడ్జెటలో నిధులు కేటాయించకపోవడంపై కూటమి నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలి.

–రాజేంద్ర ప్రసాద్, విశ్రాంత కేంద్ర గణాంకశాఖ సీనియర్ ఆఫీసర్, తిరుపతి

వేతన జీవులకు నిరాశే



పాత పన్నుల విధానంలో మార్పు తీసుకురాకుండా కొత్త పన్ను విధానంలో స్వల్ప మార్పులు తీసుకొచ్చి అమలు చేయడం ద్వారా ఈ బడ్జెట్ వేతన జీవులకు నిరాశను మిగిల్చింది. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామంటూ చెబుతూనే ఓపీఎస్ అమలుపై ప్రకటన లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా నిరాశపరిచింది. ఉద్యోగుల ఆదాయ పన్నుకు సంబంధించి కొత్త విధానంలో అధిక పన్ను చెల్లించాల్సి రావడంతో ఎక్కువ మంది పాత విధానం వైపు మొగ్గు చూపుతున్నారని, అయితే కేంద్రం ఆ దిశగా రాయితీలు లేకుండా చేయడం నిరాశనే మిగిల్చింది. విద్యా రంగానికి 6 శాతం కాకుండా కేవలం 3.25 శాతం నిధులు కేటాయించడం దారుణం.

– కె.ముత్యాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

కేంద్రం చిన్నచూపు



కేంద్ర బడ్జెట్ అంటే ఆధ్యాత్మిక నగరానికి కచ్చితంగా కేటాయింపులు ఉంటాయిని అందరూ భావించాం. విద్య, వైద్యం, పరిశ్రమల స్థాపనకు జిల్లాలో పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అటువంటి జిల్లాపై కేంద్రం చిన్న చూపు చూసింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా ఉన్న ఏపీ ప్రాంతీయ పార్టీలు ఆలోచించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సంస్థలు చాలా వరకు నిర్మాణంలో ఉన్నాయి. మాట వరుసకైనా జిల్లాను ప్రస్తావించకపోవడం శోచనీయం.

– ఏఎస్.పరమేశ్వరరావు, పౌర చైతన్యవేదిక జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

పర్మిట్ లేకుండా వస్తున్న కర్ణాటక ఆర్టీసీ సర్వీసులు

- రవాణా శాఖ తనిఖీల్లో బట్టబయలు
- పునరావృతమైతే బస్సులు సీజ్ చేస్తామన్న అధికారులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి పర్మిట్లు లేకుండా వస్తున్న బస్సులపై జిల్లా రవాణాశాఖ స్క్వాడ్ అధికారులు మురళి, హేమకుమార్ మంగళవారం పలమనేరు హైవేలో తనిఖీలు చేశారు. కొన్ని బస్సులకు రూట్ పర్మిట్లు లేకపోవడం గుర్తించారు. అవి కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన ప్రభుత్వ బస్సులు కావడంతో వారికి తొలి వార్నింగ్ ఇచ్చారు. ఇకపై ఈ మార్గంలో రావాలంటే ఖచ్చితంగా పర్మిట్లు ఉండాలని, మళ్లీ పునరావృతమైతే బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలల తనిఖీపై ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్: విద్యాశాఖ అధికారులు విధిగా పాఠశాలలను తనిఖీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం డీఈఓ కార్యాలయానికి అందాయి. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ1,2 తప్పనిసరిగా పాఠశాలలు తనిఖీలు చేయాలని, పాఠశాలల తనిఖీల్లో విద్యార్థుల సామర్థ్యాలు, టీచర్ల బోధన తప్పనిసరిగా పరిశీలించి నివేదికలను మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని అందులో ఆదేశించారు. విధుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

'శిక్షా సప్తాహ్'లో జిల్లా ముందుండాలి

– డీఈఓ దేవరాజు

పూతలపట్టు: పాఠశాలలో వారం పాటు నిర్వహించాల్సిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం జిల్లాలోనే ముందుండాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 'సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి–సమాజ భాగస్వామ్యం' అన్న అంశంపై తయారు చేసిన చార్టులను డీఈఓ పరిశీలించారు. డీవైఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి మండలంలో..

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలం 14 కండిగలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలను జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాలకు సంబంధించి విద్యార్థులు తయారు చేసిన చార్టులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుక్మిణి, ప్రసాద్ పాల్గొన్నారు.



పూతలపట్టు: చార్టులను పరిశీలిస్తున్న డీఈఓ దేవరాజు

రిలయన్స్ మార్ట్ తనిఖీ



వినియోగదారులతో మాట్లాడుతున్న లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని రిలయన్స్ మార్ట్‌ను మంగళవారం లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య తనిఖీ చేశారు. నిర్దేశించిన ధర ప్రకారం కంది పప్పు, బియ్యం అమ్ముతున్నారా? లేదా? అలాగే ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ సోనా మసూరి బియ్యం కేజీ రూ.48, కంది పప్పు కేజీ రూ.160 అమ్ముతున్నారా? అని పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేయాలని జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు శేషాద్రి వినియోగదారులకు కోరారు.

పనితీరుపై వారాంతపు నివేదికలు ఇవ్వాలి

- పశుసంవర్థక శాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆదేశం



సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అగ్రికల్చర్: పశు వైద్యశాలల పరిధిలో పశు సంపద కలిగిన రైతుల వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక దర్గా సర్కిల్ వద్ద ఉన్న బహువిధ పశువైద్యశాల ప్రాంతీయ పశు నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాలను ఆయన సందర్శించారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షించారు. పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న వారందరూ ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్, పశుసంవర్ధక యాప్‌లో హాజరు నమోదు చేయాలన్నారు. ప్రతి సహాయ సంచాలకులు, వైద్యాధికారుల పనితీరుపై వారాంతపు నివేదికలు, అలాగే ప్రతి వారం పశువైద్య చికిత్స వివరాలను సమర్పించాలన్నారు. చిత్తూరులో వీధి కుక్కల సమస్యను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలో 14 పశు వైద్యశాలలు ఉన్నాయని, ప్రతి కేంద్రంలో ఒక సహాయ సంచాలకులు పనిచేస్తున్నారని పశుసంవర్ధశాఖ జేడీ ప్రభాకర్ కలెక్టర్‌కు తెలిపారు. అలాగే 68 మంది వెటర్నరీ డాక్టర్లు, 77 మంది పారా వెటర్నరీ సిబ్బంది, 282 మంది వెటర్నరీ అసిస్టెంట్లు పనిచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ సుబ్బమ్మ, బహువిధ పశువైద్యశాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు సులభం

– డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి

గంగవరం: ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు సులభమని, ప్రతి గర్భిణి ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పుకు వచ్చేలా వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గంగవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులకు సకాలంలో వైద్యపరీక్షలు చేసి, సంబంధిత పోర్టల్‌లో అప్‌డేట్ చేసి వైద్య సేవలు, పోషకాహార పదార్థాలను అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా వారికి అందేలా చూడాలన్నారు. అలాగే గర్భిణులు ప్రతి నెలా 9న ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను త్వరితగతిన వందశాతం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బంది ఆదేశించారు. అనంతరం మారేడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలు గురించి ఆరాతీసి 104 వాహనంలో ఈసీజీ మెషిన్‌ను పరిశీలించి రిపోర్ట్స్ తనిఖీ చేశారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి

క్లుప్తంగా

ఢిల్లీకి వెళ్లిన జెడ్పీ చైర్మన్


పార్టీ అధినేతతో జెడ్పీ చైర్మన్

వి.కోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో సాగుతున్న దాడులు, హత్యలు, ఆస్తుల ధ్వంసం, హత్యాయత్నాలను నిరసిస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఢిల్లీలో చేయతలపెట్టిన ధర్నాలో పాల్గొనడానికి వి.కోట నుంచి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బయలుదేరివెళ్లారు. మంగళవారం ఆయన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫేక్ కాల్స్ నమ్మొద్దు

– ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: 'కరెంటు ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ విద్యుత్ బిల్లు ఇంకా కట్టలేదు.. బ్యాంకు అకౌంట్స్ డీటెయిల్స్ పంపితే మేము కట్ చేసుకుంటాం..' అని వచ్చే ఫేక్ కాల్స్ నమ్మి మోసపోవద్దని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర కోరారు. పలువురికి ఇలా కాల్స్ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎలక్ట్రిసిటీ ఆఫీసర్ అనే పోస్టు విద్యుత్‌శాఖలో లేదన్నారు. అలా పోస్టు పేరిట సైబర్ కేటుగాళ్లు నగదు కాజేయాలని యత్నిస్తున్నారని, వీటిపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కరెంటు బిల్లులను యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా చెల్లించే సౌకర్యం తాత్కాలికంగా ఆపివేశారన్నారు. బిల్లును ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా కట్టవచ్చన్నారు. లేనిపక్షంలో విద్యుత్‌శాఖ బిల్లుల వసూళ్ల కేంద్రాల్లో చెల్లించవచ్చన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో ప్రహరీ క్లబ్బులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా ప్రహరీ క్లబ్బులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. చెడు అలవాట్లు, డ్రగ్స్, మద్యపానం, ఇతర మత్తుపదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలను తెలిసేందుకు ఈ క్లబ్బులు ఏర్పాటు ఉద్దేశమని అందులో పేర్కొన్నారు. ఆ క్లబ్బులతో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల్లో చైతన్యం తేవాలని ఆదేశించారు.

జీఓ రద్దుకు టీచర్ల సంతకాల సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జీఓ 117 రద్దుకు టీచర్ల నుంచి సంతకాలు సేకరిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆ అసోసియేషన్ నాయకులు మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో టీచర్ల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 117 జీఓను రద్దు చేసి ప్రభుత్వం పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ రెండు మీడియంలు కొనసాగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని నెలలుగా ఉద్యోగ విరమణల వల్ల ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత తలెత్తిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర నాయకులు పురుషోత్తం మాట్లాడుతూ, తల్లికి వందనం పథకం ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకే వర్తింపజేయాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలల్లో సంతకాలు సేకరించారు. అసోసియేషన్ నాయకులు బిక్క మురళి, రాధాకుమారి, మోహన్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పేరిట ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. చిత్తూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు పాలన చేస్తామని, అపరిష్కృత డిమాండ్లు నెరవేరుస్తామని, నూతన పరిశ్రమలు, చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు.. ఇలా పలు హామీలను కూటమి నేతలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజారంజక పాలన చేయడానికి బదులు ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం, హత్యాకాండలతో కూటమి ప్రభుత్వం తన నైజమేమిటో చాటుకుంది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తరుణంలో ఇకనైనా వీటికి స్వస్తి పలికి ఇచ్చిన హామీలను, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే దిశగా, జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లేలా అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేలు గళం విప్పాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. వాస్తవానికి గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే హామీలను నెరవేర్చి నిధులు కేటాయించిందని, అంతేకాకుండా ఇవ్వని హామీలను సైతం అసెంబ్లీలో చర్చించి నెరవేర్చిన వైనాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు.



ఆశలు...ఆకాంక్షలు

- టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజల డిమాండ్
- అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేలు సమస్యలపై గళం విప్పాలని కోరుతున్న జిల్లా ప్రజానీకం
- పెండింగ్ ప్రాజెక్టులు, రోడ్లు, నూతన పరిశ్రమలు, ఏనుగుల బెడద తదితర సమస్యలకు పరిష్కారం చూపుతారా?
- జిల్లా అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- వైఎస్ఆర్‌సీపీ పాలనలో తొలి బడ్జెట్‌లోనే హామీలు నెరవేర్చిన వైనం

చిత్తూరు కలెక్టరేట్ : సామాన్యుల జీవితాలు మెరుగుపడి, ప్రతి కుటుంబానికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తేనే అభివృద్ధికి బాటలు వేసినట్లవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ప్రభుత్వం అండగా నిలిచి చేయూతనిస్తే పురోభివృద్ధి సాధ్యపడుతుంది. గత వైఎస్ఆర్‌సీపీ సర్కారు అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చింది. అదేకోవలో కూటమి ప్రభుత్వం సాగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

ఆధ్యాత్మికతకు పెద్దపీట

జిల్లాలో స్వయంభు శ్రీ కాణిపాక వినాయకస్వామి ఆలయం అభివృద్ధికి గత ప్రభుత్వంవేలాది కోట్లు వెచ్చించింది. ఇటీవల కుప్పంలో అధికారులు నిర్వహించి ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో సైతం ప్రజలుఆలయాలను అభివృద్ధి చేయాలని వినతులు అందజేశారు. అలాగే బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వర, తవణంపల్లె మండలంలోని అర్ధగిరి ఆంజనేయస్వామి, జీడీ నెల్లూరు మండలంలోని వేపంజేరి వద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి, నగరి మండలంలోని బుగ్గ అగ్రహారం వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణేశ్వరి ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛను హామీ మాటేమిటో?

అధికారంలోకి వస్తే పింఛను పెంపుతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలలో 50 ఏళ్ల వారికి సైతం పింఛను ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించినా హామీని నెరవేర్చడాన్ని కూటమి విస్మరించింది. జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు ఇతర అర్హులకు 2,67,797 మందికి పింఛన్ వస్తోంది. రూ.3వేల పింఛన్ రూ.4వేలకు, అలాగే దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని కూటమి ప్రకటించి అధికారంలోకి వచ్చాక దగా చేసిందని ప్రజలు మండిపడుతున్నారు.

రైతులకు ఏదీ భరోసా?

గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ మొదలవగానే రైతులకు 'రైతుభరోసా' నిధులు ఇచ్చేది. అలాగే ఎరువులు, విత్తనాలు ఇతర సామగ్రిని అందజేసేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైనా కూటమి ప్రభుత్వం సాయం విదల్చకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. వాస్తవానికి గత ఐదేళ్లలో జిల్లాలోని 2,08,534 మందికి రూ.1,983 కోట్లను గత ప్రభుత్వం జమ చేసింది. 'కూటమి' ప్రభుత్వం 'అన్నదాతా సుఖీభవ' పేరుతో ఒక్కో రైతుకు రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఈ ఏడాది రూ.417.06.కోట్లు ఇవ్వాలి. అయితే ఇప్పటివరకూ దీని ఊసే లేదాయె!

సంక్షేమ పథకాలకు ఎదురు చూస్తున్న వారు (మే, జూన్ నెలల్లో పథకాలు అందని వారు)

రైతులు	2,08,534
విద్యార్థులు	3,32,950
విద్యాదీవెన	1,01,370
వసతిదీవెన	35,094

2019 జూలై 12న అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించి..

రైతు భరోసా, వడ్డీలేని రుణాలు ఇవ్వడం, పంటల బీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించడం, ఆత్మహత్య చేసుకున్న రైతులు, కౌలు రైతులకు రూ.7లక్షల పరిహారం, తల్లులకు 'అమ్మఒడి', నాయీ బ్రాహ్మణులు, రజకులు, ట్యాక్సీ డ్రైవర్లు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఇమామ్‌లకు రూ.10వేలు, మూజమ్‌లకు రూ. 5వేలు వేతనం పెంపు, వైఎస్సార్ కళ్యాణమస్తు ద్వారా బీసీలకు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష బహుమానం, నామినేటెట్ పోస్టుల్లో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు, అందులో 50 శాతం మహిళలకు, కాంట్రాక్టుల్లో కూడా రిజర్వేషన్లు, అందులో 50శాతం మహిళలకు కేటాయించింది.

ఊసేలేని తల్లికి వందనం

బడులు ప్రారంభమై నెలన్నర అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు తల్లికి వందనం పథకం ఊసేలేదు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో బడులు మొదలైన వెంటనే జూన్‌లో అమ్మఒడి పథకం కింద నేరుగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసేది. ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే విద్యార్థుల తల్లులు 3,32,950 మంది ఖాతాల్లో రూ.499.42 కోట్లను ప్రభుత్వం జమ చేసేది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని జీవో 29 జారీ చేసింది. దీంతో జిల్లాలో 3,32,950మంది తల్లులు తమ పిల్లలను బడికి పంపి ఫీజులు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్నారు. ఓట్ ఆన్ అకౌంట్‌తో తల్లికి వందనం హామీని నెరవేర్చడం ఇప్పట్లో లేదని తేలిపోయింది.

జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన కొన్ని హామీలు..ప్రధాన సమస్యలు

చిత్తూరు నియోజకవర్గం

- చిత్తూరులో యూనివర్సిటీ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తామని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ హామీలిచ్చారు.
- చిత్తూరులోని ప్రశాంత్‌నగర్, ఓబనపల్లె, ఇండస్ట్రియల్ ఎస్టేట్, దొడ్డిపల్లె, సంతపేట ప్రాంతాలలో రెండు రోజులకోసారి నీరు వస్తోంది. నీటి కొరత లేకుండా ట్యాంకర్లతో సరఫరా చేయాలి.

గంగాధరనెల్లూరు నియోజకవర్గం

- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉడమలకృత్తి వద్ద అర్థాంతరంగా ఆగిన ఓవర్ బ్రిడ్జి పనులను పునఃప్రారంభించాలి.
- పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆస్పత్రి పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలి.

కుప్పం నియోజకవర్గం

- ఉపాధి కోసం ఎక్కువ మంది కుప్పం ప్రజలు బెంగళూరుకు వెళ్తుంటారు. టీడీపీ పాలన లో ఉపాధి కోసం వలస వెళ్లడం అధికంగా ఉండేది. గత వైఎస్ఆర్‌సీపీ పాలనలో స్థానికంగా ఉపాధి కల్పించడంతో వలసలు తగ్గాయి.
- కుప్పంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న హంద్రీ–నీవా, పాలారు ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.
- కృష్ణాపురం జలాశయం సప్లై చానళ్లకు మరమ్మతులు చేసి ఆయకట్టు రైతులుకు నీళ్లివ్వాలి.
- ఇటీవల ఎమ్మెల్యే భానుప్రకాష్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్ నగరికి వచ్చినప్పుడు రైల్వే సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పలు రైళ్లను నగరిలో ఆపించాలని, ఏకాంబరకుప్పం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

పుంగనూరు నియోజకవర్గం

- నేతిగుట్లపల్లె రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.54 కోట్ల పరిహారం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని పుంగనూరు ప్రజలు కోరుతున్నారు.
- పుంగనూరు, మదనపల్లె, పలమనేరు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తాగునీరు–సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణాలపై టీడీపీ నాయకులు కోర్టులో కేసులు వేసి పనులు నిలుపుదల చేయించారు. ఈ కేసులను ఉపసంహరించుకుని, ప్రాజెక్టులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- మేలుందొడ్డి సమీపంలో నిర్మించనున్న జర్మన్ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ఆరడిగుంట వద్ద నిర్మిస్తున్న ఒక కంపెనీ నిర్మాణా నిర్మాణానికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.
- పుంగనూరు–శంకర్‌రాయలపేట రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- **పలమనేరు నియోజకవర్గం**లో ఏనుగుల సమస్య పరిష్కరించాలి. సాగు, తాగునీరు పరిష్కారానికి గంగమ్మ శిరస్సు ప్రాజెక్టు నిర్మించాలి. వైఎస్ఆర్‌సీపీ పాలనలో రోడ్లను వేయనివ్వకుండా టీడీపీ నాయకులే అడ్డుకున్నారు. ఆ రోడ్డు పనులన్నీ పూర్తి చేయాలని కోరుతున్నారు.

నగరి నియోజకవర్గం

- నగరి నియోజకవర్గంలో 1000 చదరపు అడుగుల ఇల్లు ఉన్నవారికి మాత్రమే పింఛను అనే నిబంధనను తొలగిస్తామని హామీ ఇచ్చారు. మరమగ్గ కార్మికులకు వృత్తి రీత్యా 3000 చదరపు అడుగుల వరకు ఇల్లు ఉండడంతో వారందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరుతున్నారు.
- మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తానని అప్పట్లో చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ హామీని నెరవేర్చాలని నియోజకవర్గంలోని మరమగ్గ కార్మికులు ఎదురు చూస్తున్నారు.

చిత్తూరు జిల్లా ప్రత్యేకత

చిత్తూరు జిల్లాలో భిన్న సంస్కృతులు కనిపిస్తుంటాయి. చిత్తూరు జిల్లా 1911 ఏప్రిల్ 1న ఏర్పాటైంది. 1960 ఏప్రిల్ 1 న రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ తర్వాత తమిళనాడు రాష్ట్రంలోని కొన్ని తాలూకాలు చిత్తూరు జిల్లాలో కలిపారు. 1985లో చిత్తూరు జిల్లాలో 66 రెవెన్యూ మండలాలను ఏర్పాటు చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం 2022 ఏప్రిల్ 4న చిత్తూరు జిల్లాను 31 మండలాలుగా, 4 రెవెన్యూ డివిజన్లు, 7 అసెంబ్లీ నియోజకవర్గాలుగా చేశారు. 6,859 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జిల్లా వ్యాపించి ఉంది. జిల్లా వ్యాప్తంగా 1,86,605 హెక్టార్లు అటవీ, 85,357 హెక్టార్లు బంజరు, సాగుకు యోగ్యం కాని భూమి ఉంది. 10,667 హెక్టార్లలో శాశ్వత పచ్చిక బయళ్లు, ఇతర గడ్డి భూములున్నాయి. మొత్తం భౌగోళిక విస్తీర్ణం 6,85,898 హెక్టార్లు కాగా పంట విస్తీర్ణం 2,00,193 హెక్టార్లు ఉంది. వ్యవసాయం, పాడి పరిశ్రమ ఆధారపడి రైతులు జీవిస్తున్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

వైఎస్ఆర్‌సీపీ పాలనలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యనిచ్చింది. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా తీర్చిదిద్దింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో నాడు–నేడు మొదటి విడతలో రూ.150 కోట్లతో 743, 2వ విడతలో రూ.449 కోట్లతో 1210 ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చింది. ఇలాగే కూటమి ప్రభుత్వం సైతం ప్రాధాన్యతనివ్వాలని, మిగిలిన బడులను నిధులు వెచ్చించి అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లాలో పలు మండలాల నుంచి మెడికల్, ఇంజినీరింగ్ చదువులకు యువత పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, వైద్య కళాశాల, సైనిక్ స్కూల్, నవోదయ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థలను నెలకొల్పాలని విద్యావేత్తలు బలంగా కోరుతున్నారు. అలాగే 75 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్ పూర్తిగా ప్రవేశపెట్టాలి



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలి. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సైతం పూర్తి స్థాయి బడ్జెట్‌నే ప్రవేశ పెడుతోంది. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం సరి కాదు. ప్రజా ప్రతినిధులు దీనిపై అసెంబ్లీలో మాట్లాడాలి. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడే కూటమి పార్టీ ఇచ్చిన హామీలు, ప్రకటించిన పథకాలకు నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది.

– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఓట్ ఆన్ బడ్జెట్ ఓ ఎత్తుగడ



రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్‌అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఒక ఎత్తుగడ అనుకోవచ్చు. ఇది ప్రవేశపెడితే పథకాల అమలుకు తగిన నిధులు లేవని ఒప్పుకున్నట్లే! గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఈ నెలతో ముగుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుకు సరిపడా వనరులు సమకూర్చుకుని ఫుల్ బడ్జెట్‌లో కేటాయింపులు చూపించాలి. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు జిల్లా డిమాండ్లను ప్రస్తావించాలి. – ధనంజయరావు, దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

- లారీని ఢీకొన్న కారు
- ఒకరి మృతి

ఓజిలి: దైవదర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఓజిలి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ప్రకాశం జిల్లా, చీమకుర్తి గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు ఆరుగురు కారులో ఈ నెల 20న అరుణాచలేశ్వరి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం రెండు రోజులు అక్కడే గడిపారు. 22న ఉదయం 9గంటలకు కారులో చీమకుర్తికి తిరిగి బయల్దేరారు. రాచపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలోని తారు ప్లాంట్ వద్దకు వచ్చే సరికి రాత్రి 11.30 గంటలయ్యింది. ముందు వెళ్తున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి లారీని ఢీకొంది. కారులో వెనుక కూర్చొని ఉన్న చిన్నపురెడ్డి శ్రీను(40) తలకు బలమైన గాయమైంది. ఓజిలి, హైవే పోలీసుల సాయంతో అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతిచెందాడు. అలాగే గాయాలైన కారులోని అనుషా, లావణ్య, ప్రియాంకకు గూడూరు నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


ప్రమాదంలో మృతి చెందిన శ్రీను


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే దిగుబడి

- జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల: మామిడిలో కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడి రైతులకు దివిటివారిపల్లెలో మంగళవారం మామిడిలో కోతల అనంతరం తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కోతల అనంతరం యాజమాన్య పద్ధతులపైనే దిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు.ఎండిన కొమ్మలు, అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి, సూర్యరశ్మి ధారాళంగా ప్రసరించేలా చూడాలన్నారు. కొమ్మల కత్తిరింపు పూర్తయ్యాక లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, డైమిథొయేట్ 2 ఎంఎల్, వేపనూనె 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని, మామిడి పంటలో ఉలవలు, అలసంద, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట నిచ్చే పంటలను సాగు చేసి కలియదున్నాలని వివరించారు. 10 ఏళ్ల మామిడి చెట్టుకు సుమారు 100 కేజీల పశువుల ఎరువు, 2 కేజీల యూరియా, 6 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2 కేజీల పొటాష్ ఎరువులను చెట్టు మొదలు నుంచి 3–4 అడుగుల దూరంలో 30–45 సెంటీమీటర్ల గుంత తీసి, వెంటనే నీటి తడులను ఇవ్వాలన్నారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, మండలంలో కొన్నేళ్లుగా కొందరు రైతులు బిందు సేద్యంతో మామిడిలో మంచి దిగుబడులు పొందుతున్నారన్నారు. కొత్తగా బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకునే రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలని కోరారు. ఏపీఎంఐపీ సహాయ పథక సంచాలకులు ఫజులున్నీషా బేగం మాట్లాడుతూ, తక్కువ నీటి లభ్యతతో ఎక్కువ దిగుబడి వచ్చేందుకు అందరూ బిందుసేద్యం వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి సాగరిక, స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


మామిడి కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి